
నమస్తే తెలంగాణ





2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేపై రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పక్కన బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

# కేసులు, అరెస్టులకు భయపడం

## ప్రతీకారం మాని పాలనపై దృష్టిపెట్టాలి

- ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం
- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందే
- ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాడుతాం
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, నవంబర్ 11 : కేసులు, అరెస్టులు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్న బెదిరింపులకు భయపడేది లేదని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రభుత్వం ప్రతీకారం మాని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారికి అన్యాయం చేస్తే ఊరుకోమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనన్నారు. ప్రజలకిచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీల అమలు విషయమై ప్రజల తరఫున ప్రతిపక్ష పార్టీగా పోరాడతామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు మంగళం పాడాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని ఆరోపించారు. ఆదివారం హనుమకొండకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై స్థానిక కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము, తమ నాయకుడు తెలంగాణ కోసం జైలుకు వెళ్లామని, మీరెందుకు వెళ్లారో ప్రజలకు తెలుసన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు, దాడికి దిగుతున్నాడన్నారు. ప్రశ్నిస్తే మూసీలో కలిపేస్తాం.. బుల్డోజర్లతో తొక్కిస్తాం అంటూ కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను, సీఎం, మంత్రులు, నాయకుల మాటలను గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ దానిపై మాట్లాడుతున్నారని, కూల్చాలనుకుంటే కూల్చండని, తాము సహనంతో ఉన్నామని, రెచ్చగొట్టొద్దని హెచ్చరించారు. ఇంటింటా సర్వే చేస్తున్న క్రమంలో అధికారులను ప్రజలు తిడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రూ. 7 వేల కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించిందని, లక్ష కోట్ల బడ్జెట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం జరుగుతున్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డే అన్నారని పేర్కొన్నారు. బీసీ, దళిత బంధు ఏమైందన్న తమ ఎమ్మెల్యేపై దాడి చేస్తారా? అంటూ ప్రశ్నించారు. దమ్ముంటే ప్రజలు కేసీఆర్‌ను మర్చిపోయేలా పాలన చేయాలని సూచించారు. కేటీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని దాస్యం అన్నారు.

### అప్పుడో మాట.. ఇప్పుడో మాట : గండ్ర

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌పై అడిగితే సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు స్థాయి మరిచి విమర్శలు చేస్తున్నారన్నారు. సమగ్ర సర్వేను స్వాగతిస్తున్నామని, అభ్యంతరకర ప్రశ్నలపై ప్రజలకు అనుమానాలున్నాయని, ఈ క్రమంలో అధికారులను వారు నిలదీస్తున్నారని అన్నారు. 2014లో సమగ్ర కుటుంబ సర్వేపై రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను విలేకరులకు చూపించారు. వివరాల సేకరణపై అప్పుడొక మాట, ఇప్పుడొక మాటను సీఎం మాట్లాడుతున్నారని, ద్వంద్వ ధోరణి సరైంది కాదన్నారు. నాటి, నేటి మాటలకు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ కాలంలో ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం దేశంలోని ఏ రాష్ట్రంలో లేదన్నారు. పత్తికి మద్దతు దక్కడం లేదని, సన్నాలకు బోనస్ రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో చెప్పాలని గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మైనారిటీ నాయకుడు నయీముద్దీన్, నాయకులు రాంమూర్తి, జానకీ రామ్, వెంకన్న, రఘు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



పత్తియార్డును ముట్టడించిన రైతులు



కాంటాలపై కునుకు తీస్తున్న హమాలీ



ఎనుమాముల మార్కెట్ యార్డులో కాంటాలు కాకపోవడంతో పత్తి బస్తాలపైనే నిద్రిస్తున్న రైతులు



# కొనుగోళ్లు లేక.. కాంటాలు కాక..

## ఎనుమాముల మార్కెట్లో పత్తి రైతుల అగచాట్లు

- కాటన్ మిల్లులకు సీసీఐ కొర్రీలు
- సమ్మెకు పిలుపునిచ్చిన ఖరీదుదారులు
- నాలుగు గంటల పాటు నిలిచిన క్రయవిక్రయాలు
- చేసేది లేక బస్తాలపైనే రైతుల కునుకు

కాశీబుగ్గ, నవంబర్ 11 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే వారు లేక.. కొన్నా గిట్టుబాటు ధర దక్కక ఇబ్బందులు పడుతున్నారు. పెట్టిన పెట్టుబడి రాక ఆందోళన చెందుతున్నారు. సోమవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో కాటన్ మిల్లర్ల సమ్మెతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ విధించిన కఠిన నిబంధనలకు నిరసనగా క్రయవిక్రయాలను బంద్ చేశారు. దీంతో ఆదివారం అర్ధరాత్రే పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతకూ కాంటాలు కాకపోవడంతో మార్కెట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పత్తియార్డును ముట్టడించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా మార్కెట్ కార్యదర్శి నిర్మలతో పాటు ఎనుమాముల ఇన్‌స్పెక్టర్ అల్లె రాఘవేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్ రైతులను శాంతింపజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. ఈ సమయంలో ఖరీదుదారులు రాక, కొనుగోళ్లు జరగక రైతులు పత్తి బస్తాలపైనే కునుకు తీశారు. కాంటాలు వేసే పరిస్థితి లేకపోవడంతో హమాలీలు, దడువాయిలు సైతం కాసేపు కాంటాలపైనే నిద్రపోయారు. నాలుగు గంటలపాటు వేచి చూశాక ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంటకు జెండా పాట నిర్వహించడంతో క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మార్కెట్‌కు సుమారు 600 పత్తి బస్తాలతో పాటు 30 వాహనాల్లో లూజు పత్తి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. కాగా క్వింటా పత్తి రూ. 6,960 ధర పలికింది.



కాంటాలు కాకపోవడంతో పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న రైతులు

# రైతులను నిలువుదోపిడీ చేయడమే ప్రజాపాలనా?

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

నల్లబెల్లి, నవంబర్ 11 : అన్నదాతలను నిలువుదోపిడీ చేయడమే ప్రజాపాలనా? అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నల్లబెల్లిలోని తన స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన 420 హామీలను అమలుచేయడంలో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. వానకాలంలో పంటలు సాగుచేసిన అన్నదాతలకు అతివృష్టి శాపంగా మారిందని.. ఈ పరిస్థితుల్లో వారికి రైతుబంధు విడుదల చేయకపోవడంతో పాటు పండిన కొద్దిపాటి పంటను మార్కెట్‌లో విక్రయించుకోలేని దుస్థితి నెలకొనడం కాంగ్రెస్ ప్రభుత్వ నీతిమాలిన రాజకీయానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం 54 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగుచేస్తే ఒక క్రాప్‌లోనే రైతులు పత్తి పంటను తొలగించి అంతర పంటలు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పాడి తర్వాత పత్తిపైనే రైతులు ఆధారపడి ఉన్నారని, నేడు



నల్లబెల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

రేవంత్ సర్కారు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎకరాకు పత్తి పంట తొమ్మిది క్వింటాళ్లు రావాల్సి ఉండగా కేవలం 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వస్తుండడంతో పెట్టిన పెట్టుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆగమవుతుంటే రాష్ట్రంలో పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇదిలా ఉంటే పండిన కొద్దిపాటి పంటను మార్కెట్లో విక్రయించుకోవాలంటే సీసీఐ కొనుగోళ్లను నిరాకరించడం సిగ్గుచేటన్నారు. అంతేగాక వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రైతులు పండించిన అన్ని పంటలను కొనుగోలు చేయాలని.. లేకపోతే కాంగ్రెస్ సర్కారును ప్రజాక్షేత్రంలో ఎండగట్టి రైతులకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నర్సంపేట మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, నాయకులు కొడారి రవన్న, మోటూరి రవి, కుమారస్వామి, సట్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# చిట్టీ డబ్బులు చెల్లించాలి

**అక్షర చిట్‌ఫండ్ ఎదుట బాధితుల ఆందోళన**

హనుమకొండ/సుబేదారి, నవంబర్ 11 : బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. అక్షర చిట్‌ఫండ్ మోసాలు నశించాలని, చిట్టీ డబ్బులు వెంటనే చెల్లించాలనే బ్యానర్లతో సోమవారం ధర్నా చేశారు. విషయం తెలుసుకొన్న సుబేదారి పోలీసులు అక్కడి చేరుకొని సముదాయించేందుకు ప్రయత్నించా రు. అయినప్పటికీ బాధితులు వినకపోవడంతో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు. వారం రోజుల క్రితమే సీపీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదని కొందరు, తమను ఈ రోజు వచ్చి డబ్బులు తీసుకెళ్లమని సమాచారం ఇచ్చారని మరికొందరు బాధితులు తెలిపారు. దీంతో అక్కడికి చిట్టి బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఏసీపీ బాధితులతో మరోసారి మాట్లాడి అక్షర యాజమాన్యంతో ఒప్పంద పత్రం రాయించి ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది. రూ.2 లక్షల వరకు ఉన్నవారికి డిసెంబర్, జనవరిలో, ఆపై ఉన్నవారికి వాయిదాల్లో డబ్బులు చెల్లిస్తామని ఒప్పందం చేయించడంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

# వైద్యులపై కర్ణన్ సీరియస్

- సంతకాలు పెట్టి బయటకు వెళ్లడంపై ఆగ్రహం
- జీఎంహెచ్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర ఆరోగ్య కమిషనర్ ఆర్వీ కర్ణన్



హనుమకొండ ప్రసూతి ఆస్పత్రిలో వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న కర్ణన్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 11 : ప్రభుత్వ ప్రసూతి దవాఖాన (జీఎంహెచ్)లో సంతకాలు పెట్టి వెళ్లిన వైద్యులపై రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సీరియస్ అయ్యారు. వైద్యుల హాజరు పట్టికను పరిశీలించి గైర్హాజరైన, సెలవులో ఉన్నవారి వివరాలను సూపరింటెండెంట్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. 'సంతకాలు పెట్టిన వైద్యులందరూ ఉన్నారా.. వచ్చారా..? లేకుంటే సంతకాలు పెట్టి వెళ్లారా? అని ఒక్కొక్క వైద్యురాలి పేరు చదివారు. డాక్టర్ భవాని కనిపించకపోవడంతో ఆరా తీశారు. అక్కడే ఉన్న ఆర్ఎంవో అంబరీష్ ఆమెకు ఫోన్ చేయగా 10 నిమిషాల తర్వాత అక్కడికి వచ్చారు. కొందరు సెలవులో ఉన్నారని, మరికొందరు కేఎంసీకి వెళ్లారని ఇలా సూపరింటెండెంట్ సమాధానం చెప్పడం విశేషం. ఆర్వీ కర్ణన్ సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి దవాఖానను తనిఖీ చేశారు. ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ ఆదేశాలతో దవాఖానను తనిఖీ చేస్తారనే విషయం తెలుసుకున్న వైద్యులందరూ విధులకు హాజరయ్యారు. డీఎంహెచ్‌వో వస్తారనుకునే సమయానికి ఆర్వీ కర్ణన్ రావడంతో వైద్యవర్గాల్లో గుబులు మొదలైంది. డీఎంహెచ్‌వో అప్పయ్య, పీవోడీటీటీ లలితాదేవి, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ఆర్ఎంవో అంబరీష్‌తో కలిసి ఆయన జీఎంహెచ్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇంకా ఎక్కువగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్‌లో రోజుకు ఎన్ని టిఫా, గైనిక్ స్కాన్‌లు చేస్తున్నది తెలుసుకొని వివరాలను టీ డయాగ్నస్టిక్ హబ్ పోర్టల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం లేబర్‌రూం, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ల్యాబ్, వార్డు, నవజాత శిశువు సంరక్షణ కేంద్రం, మిల్క్‌బ్యాంకు, ఐసీటీసీ సెంటర్లను సందర్శించారు. గైనకాలజిస్టులు, అనస్థీషియన్లు ఎంత మంది అందుబాటులో ఉన్నారని, ప్రతిరోజు ప్రసవాలు, ఇతర ఆపరేషన్లు ఎన్ని జరుగుతున్నాయో తెలుసుకున్నారు. వార్డులను సందర్శించి బాలింతలతో మాట్లాడారు. ప్రతి గర్భిణి పీహెచ్‌సీ నుంచి జీఎంహెచ్‌కు 3వ, 4వ చెకప్ పరీక్షకు వచ్చేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు చూడాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

### మెరుగైన వైద్యం అందించాలి

వరంగల్ చౌరస్తా : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్వీ కర్ణన్ వైద్యులకు సూచించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా వైద్యాధికారులతో కలిసి ఆయన సోమవారం వరంగల్ సీకేఎం హాస్పిటల్‌ను సందర్శించారు. నవజాత శిశువుల వార్డు, లేబర్ రూం (కాన్పుల గది)లో అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో పీజీ డాక్టర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీల సంఖ్య పెంచాలన్నారు. మాత, శిశు మరణాలు లేకుండా చూడాలని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీకి తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. దవాఖాన ఆవరణలో పరిశుభ్రత లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వరంగల్ డీఎంహెచ్‌వో సాంబశివరావు, అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు ప్రకాశ్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపుతో సాగు చేయలేకపోతున్నాం

- పెద్ద చెరువు రిజర్వాయర్ తూముల నుంచి నీటి లీకేజీ
- 'గ్రీవెన్స్ సెల్'లో కలెక్టర్‌కు బాధిత రైతుల వినతి

పర్వతగిరి : మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్, పోలకమ్మ చెరువు మధ్య ఉన్న వంద ఎకరాల పట్టా భూములు వరద నీటితో మునిగిపోతున్నాయని బాధిత రైతులు సోమవారం వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్ద చెరువు రిజర్వాయర్‌కు తూములు పటిష్ఠంగా నిర్మించకపోవడంతో నీరు లీకై సుమారు వంద ఎకరాలు మునిగిపోతున్నాయని వాపోయారు. మూడేళ్లుగా పంటలు సాగుచేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే పెద్ద చెరువు రిజర్వాయర్ తూములు (షెట్టర్లు) మరమ్మతు చేయించాలని కోరారు. పోలకమ్మ చెరువు నీటి విడుదలకు రెండు తూములకు గేట్లు ఏర్పాటు చేయాలని, ఈ చెరువు చిన్న మత్తడికి పూర్వం ఎస్సీకాలనీ పక్కనున్న బుంగను పూడ్చాలని కోరారు. పెద్ద చెరువు నీటిని చేపలవేట కోసం ఇష్టానుసారంగా విడుదల చేస్తున్న మత్స్యకారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్వం ఉన్న పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి పోలకమ్మ చెరువు వరకు ఉన్న పంటలకు నీటి వసతి కల్పించి, కాల్వను సీసీతో పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పోలకమ్మ చెరువు ముంపు బాధిత రైతులు సంగారపు రమేశ్, చిన్నపెల్లి దేవేందర్, బొట్ల కనకరాజు, అర్షం యుగేందర్, సంకినేని పూలమ్మ, బొట్ల వెంకన్న, కాసర్ల ప్రభాకర్, బొట్ల రమేశ్, అర్షం యాకయ్య, బొట్ల పూలమ్మ, పుష్పమ్మ, ఉప్పలమ్మ, సింగారపు నర్సయ్య, ఆకులపెల్లి యాకయ్య, చిర్ర సుమన్ వినతిపత్రం సమర్పించారు.



గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముంపు బాధిత రైతులు

# పడికట్టు.. కనికట్టు!

**ఏజెన్సీ రైతులను ముంచుతున్న ధాన్యం మాఫియా**

వెంకటాపురం (నూగూరు), నవంబర్ 11 : ఏజెన్సీలోని అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ధాన్యం మాఫియా రెచ్చిపోతున్నది. పడికట్టు పేరిట కనికట్టు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నది. వానకాలం పంట చేతికొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్న మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో చేసేది లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలకు బదులుగా పడికట్టు కాంటాలను వినియోగిస్తూ మోసం చేస్తున్నారు. కాంటాలో ఒకవైపు బాట్లకు బదులుగా ధాన్యం బస్తాను ఉంచి మరోవైపు ధాన్యం తూకం వేస్తున్నారు. దీంతో క్వింటాకు 4 నుంచి 5 కిలోల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. దీనికి తోడు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ట్రక్‌షీట్లతో అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పడికట్టుతో కాంటా వేస్తున్న వ్యాపారులు